
# ఆంధ్రప్రదేశ్.. పంచవర్ష ప్రణాళికలు.. ప్రగతి



**ఆంధ్రప్రదేశ్‌లో ప్రణాళికలు ప్రారంభమైన తర్వాత రెండు దశాబ్దాలలో ఆర్థిక, సాంఘిక అవస్థాపనా సౌకర్యాల కల్పన కోసం కృషి జరిగింది. ఈ కాలంలో వృద్ధిరేటు మందగించినప్పటికీ.. 1980లలో పారిశ్రామిక రంగం.. 1990లలో సేవా రంగం ప్రగతి సాధించాయి. రాష్ట్ర స్థూలజాతీయోత్పత్తిలో ప్రాథమిక రంగ వాటా తగ్గి ద్వితీయ, తృతీయ రంగాల వాటా పెరగడంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా రూపొందింది. రాష్ట్రంలో అమలు చేసిన కుటుంబ సంక్షేమ కార్యక్రమాల వల్ల జనాభా పెరుగుదల రేటు తగ్గింది. 10వ పంచవర్ష ప్రణాళికలో తలసరి ఆదాయం రూ. 24,478 కి చేరింది. 11వ ప్రణాళికలో పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయటం, సేవా రంగంలో ఉపాధి అవకాశాలు పెంచడం, అందరికి విద్యా, ఆరోగ్యం, ఐటీ రంగ అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పన ప్రాధాన్యత అంశాలు. ప్రణాళిక యుగాన్ని మొత్తం పరిశీలిస్తే.. ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణం తగ్గగా ఆహార ధాన్యాల ఉత్పత్తి 1974-75లో 90.96 టన్నుల నుంచి 2008-09లో 204.04 లక్షల టన్నులకు పెరిగింది. ప్రణాళికా కాలంలో ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాల్లో జరిగిన వృద్ధిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని పరిశీలించే నేపథ్యంలో ఈ సిలబస్ రూపొందించారు.**

### పేపర్- III
### విభాగం-2 యూనిట్-5 సిలబస్

- ఆంధ్రప్రదేశ్ పంచవర్ష ప్రణాళికలు – ఇటీవల పంచవర్ష ప్రణాళికలో పరివ్యయాలు, ప్రభుత్వ రంగ ప్రణాళికకు ఆర్థిక సహాయం, వనరుల కేటాయింపు విధానం.

- **ఆంధ్రప్రదేశ్‌లో ఆయా ప్రణాళికల్లో వనరుల కేటాయింపులో వివిధ రంగాల ప్రాధాన్యతా క్రమాలను వివరిం చండి?**

జ: రాష్ట్రస్థాయిలో ప్రణాళికను కేంద్ర ప్రణాళికాలక్ష్యాల కనుగుణంగా రూపొందిస్తారు. ప్రణాళికా యుగాన్ని మొత్తం పరిశీలిస్తే..వనరుల కేటాయింపులో నీటి పారుదల, విద్యుత్ రంగం, సామాజిక సేవా రంగాలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. మొదటి ప్రణాళికా వ్యయం రూ.96.73 కోట్లుకాగా ఇది 10వ ప్రణాళికలో 69,511.66 కోట్లకు పెరిగింది. వివిధ రంగాలకు కేటాయింపులు పరిశీలిస్తే.. వ్యవసాయానుబంధ రంగాల కేటాయింపుల శాతంలో పెద్దగా మార్పు లేనట్లు తెలుస్తోంది. గ్రామీణాభివృద్ధికి వనరుల కేటాయింపులోనూ ఒడిదుడుకులను గమనించవచ్చు. పరిశ్రమలు, గనులకు కేటాయింపులు తక్కువే.

☞ ఈ క్రమంలో మొదటిప్రణాళిక నుంచి 11వ ప్రణాళిక వరకు ప్రణాళికా వ్యయంలోని పెరుగుదలను వివరిస్తూ, వనరులకేటాయింపులో వివిధ ప్రణాళికల్లో వివిధ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి గల కారణాలను విశ్లేషించాలి. చివరగా భవిష్యత్తులో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి వనరుల కేటాయింపులో ఇవ్వాల్సిన ప్రాధాన్యతను వివరిస్తూ సమాధానం రాయాలి.

- **పంచవర్ష ప్రణాళికా కాలంలో రాష్ట్రంలో వివిధ రంగాల తీరుతెన్నులు పరిశీలించండి?**

జ: ప్రణాళికా యుగంలో రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో కొంతమేర అభివృద్ధి జరిగింది. నీటి పారుదల రంగానికిచ్చిన ప్రాధాన్యత వల్ల ఇది సాధ్యమైంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగినప్పటికీ సాగుకు యోగ్యమైన భూమి తగ్గుతోంది. పాడి పరిశ్రమ, పశుగణాభివృద్ధి, కోళ్ల పెంపకం, చేపల పెంపకానికి సంబంధించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పారిశ్రామిక రంగానికి సంబంధించి చిన్నతరహా పరిశ్రమల్లో వృద్ధి మందగించినప్పటికీ భారీ పరిశ్రమలు, రవాణా, కమ్యూనికేషన్ రంగాలు వృద్ధి చెందాయి. ఐటీ రంగంలో విశేషమైన ప్రగతి చోటు చేసుకుంది.

☞ ఈ క్రమంలో గత 5 దశాబ్దాల కాలంలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో చోటుచేసుకున్న పరిణా మాలు విశ్లేషించాలి. దీంతోపాటు ప్రస్తుతం ఆర్థికాభి వృద్ధి మందగించిన నేపథ్యంలో ఈ రంగాలు భవిష్య త్‌లో ఎలా పురోగమిస్తాయో వివరించాలి.

● **ప్రభుత్వ రంగ ప్రణాళికకు ఆర్థిక సహాయంలో భాగంగా కేంద్రం నుంచి రాష్ట్రాలకు వనరుల బదిలీ ఎలా జరుగుతుంది?**

జ: రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా వ్యూహంలో భాగంగా వనరుల సమగ్ర అంచనా, నిర్ణీత కాలంలో సాధించాల్సిన లక్ష్యాలను నిర్ణయిం చడం వాటి సాధనకు పటిష్ట వ్యూహరచన అనే మూడు అంశాలను దృష్టిలో ఉంచు కుంటుంది. ప్రభుత్వ రంగ పెట్టుబడిలో కేంద్రం నుంచి రాష్ట్రాలకు బదిలీ అయ్యే వనరులు ఈ విధంగా ఉంటాయి. 1.ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు.. కేంద్ర పన్నుల రాబడిలో రాష్ట్రాల వాటాతో పాటు గ్రాంట్లు. 2. ప్రణాళికా సంఘ సిఫార్సు మేరకు ప్రణాళికాసహాయంలో భాగంగా గ్రాంట్లు, రుణాలతో పాటు ఎక్స్ టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్ట్స్ (externally aided projects) నిర్మాణానికిగాను గ్రాంట్లు, రుణాలు. 3. కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ ప్రాజెక్ట్‌ల కింద గ్రాంట్లు, రుణాలు. 4. ప్రణాళికేతర గ్రాంట్లు. 5. ప్రణాళికేతర రుణాలలో భాగంగా నికర చిన్న మొత్తాల పొదుపు.

☞ ఈ క్రమంలో కేంద్రం నుంచి రాష్ట్రాలకు బదిలీ అయ్యే వనరులు, వివిధ అంశాలకు సంబంధించిన గణాంకాలు, వివిధ అంశాలకు బదిలీ అవుతున్న వనరుల మొత్తంలో మార్పునకు సంబంధించిన సమగ్ర సమా చారంతో జవాబు రాయాలి.

● **రాష్ట్రంలో ప్రణాళికల పరంగా అమలు చేసిన గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను చర్చించండి?**

జ: కేంద్ర ప్రభుత్వం ప్రణాళికల పరంగా అమలు చేసిన వివిధ గ్రామీణాభివృద్ధి కార్యక్ర మాలు రాష్ట్రంలోనూ అమలయ్యాయి. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామీణాభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకుంది. పాడిపరిశ్రమ అభివృద్ధి కోసం డైరీ డెవ లప్‌మెంట్ కార్పొరేషన్, నిమ్న జాతుల అభివృద్ధి కోసం 1983లో 15 సూత్రాల ప్రగతి పథం, గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరచడానికి అనేక సంక్షేమపథకాలను చేపట్టింది. గ్రామీణ ఉపాధి పెంపునకు ఇందిరా క్రాంతి పథకం, రాజీవ్ ఉద్యోగ శ్రీ వంటి కార్యక్రమాలు,ఆదర్శ గ్రామాల అభివృద్ధి కోసం ఇందిరమ్మ పథకాన్ని ప్రారంభించింది.

☞ ఈ క్రమంలో ప్రధానమైన గ్రామీణాభివృద్ధి కార్యక్ర మాలైన స్వర్ణ జయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఉ పాధి హామీ పథకాలను వివరిస్తూ వాటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికోసం చేపట్టిన ముఖ్య పథకాలను పేర్కొనాలి.

● **ప్రణాళికా యుగంలో రాష్ట్రం సాధించిన విజయాలు, అపజయా లను చర్చించండి?**

జ: ప్రణాళికా యుగంలో ఆర్థిక గణాంకాలను ఒక్కసారి పరిశీలిస్తే.. రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందని చెప్పవచ్చు. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి 2008-09లో రూ.2,52,318 కోట్లకు పెరిగింది. రాష్ట్ర తలసరి ఆదాయం 2001-02లో స్థిర ధరల వద్ద రూ. 16,574 కాగా ఇది 2008- 09 లో రూ. 26,983కు చేరింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగింది. ప్రణాళికా యుగంలో మొదటి 40 సంవత్సరాల కాలంలో పారిశ్రామికీకరణ ప్రభుత్వ రంగం లోనే ఎక్కువగా చోటుచేసుకుంది. 2004-05 తర్వాత ప్రభుత్వం ప్రకటించిన అనేక ప్రోత్సహకాలు, రాయితీల వల్ల ప్రైవేట్ రంగం లో పారిశ్రామికీకరణ వేగవంతమయింది. సేవా రంగం కూడా గణనీయమైన ప్రగతిని సాధించింది. ప్రణాళికా యుగంలో చోటు చేసుకున్న నిర్మాణాత్మక మార్పులు రాష్ట్రాన్ని అభివృద్ధి చెందు తున్న ఆర్థిక వ్యవస్థగా రూపొందించడానికి దోహదం చేశాయి. ప్రణాళికాయుగంలో కొన్ని రంగాల్లో అనుకున్న లక్ష్యాలను సాధిం చినప్పటికీ.. కొన్ని రంగాల్లో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన నీటిపారుదల సౌకర్యాలు కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతం కావడంతో ప్రాంతీ య అసమానతలు పెరిగాయి. అదే విధంగా పారిశ్రా మికీకరణ కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. సేవా రంగ కార్యకలా పాలు పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా లభ్యమవుతున్నాయి. వివిధ రంగాల్లో ప్రగతి సాధించినప్పటికీ దీర్ఘకాల సమస్యలకు ప్రణాళికలు పరిష్కారం చూపించలేకపోయాయి. మొత్తం ప్రణా ళికా యుగంలో నీటిపారుదల,విద్యుత్ రంగం, సామాజిక కమ్యూ నిటీ సేవలకు వనరుల కేటాయింపులో ప్రాధాన్యతనిచ్చినప్పటికీ వీటి విషయంలో ఇప్పటికీ స్వయం సమృద్ధి సాధించలేకపోయాం.

☞ ప్రణాళికలపై సమీక్ష అనే ప్రశ్న వచ్చే పరీక్షలో కీలకం కాగలదు. వివిధ రంగాల్లో చోటు చేసుకున్న ప్రగతి తోపాటు ఆయారంగాల్లో వృద్ధిరేటులో ఒడిదుడుకులు ఏర్పడడానికి కారణాలు విశ్లేషించాలి. దీంతోపాటు ప్రణాళికాయుగంలో అపరిష్కృతంగా మిగిలిపో యిన సమస్యలను పరిశీలిస్తూ తద్వారా ఎటువంటి పరిణామాలు సంభవిస్తాయో వివరించాలి.

● **రాష్ట్రంలో 10వ పంచవర్ష ప్రణాళికా ప్రగతిని 11వ పంచవర్ష ప్రణాళి కలో ప్రాధాన్యతాంశాలను చర్చించండి?**

జ: రాష్ట్రం 10వ పంచవర్ష ప్రణాళిక కాలంలో (2002- 07) ఆర్థికంగా ప్రగతి సాధించింది. ఈ కాలంలో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు 8.33 శాతంగా నమోదయింది. వ్యవసాయరంగం 4.68 శాతం, పారిశ్రామిక రంగం 11.49 శాతం, సేవారంగం 8.86 శాతం మేర వృద్ధి సాధించాయి. ప్రణాళికా సంఘం ప్రణాళికా వ్యయంగా రూ. 46,614 కోట్లను ఆమోదించింది. ఇది చివరకు రూ. 69,511.66 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయంలో ఆర్థిక సేవలపై 72.23 శాతం, సాంఘిక సేవలపై 26.52 శాతం, సాధారణ సేవలపై 1.25 శాతం వ్యయం చేశారు. ఆర్థిక సేవలో భాగంగా నీటిపారుదల రంగంపై చేసిన వ్యయం ఎక్కువ.

10వ ప్రణాళికలో జరిగిన ప్రగతిని దృష్టిలో ఉంచుకుని 11వ ప్రణా ళికలో వ్యవసాయ రంగంలో 5 శాతం, పారిశ్రామిక రంగంలో 10

శాతం, సేవారంగంలో 11 శాతం వృద్ధిని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ ప్రణా ళికా కాలంలో (2007-12) రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు లక్ష్యం 9.5 శాతం. సాంఘిక రంగానికి పెద్దపీట వేశారు. విద్యారంగం, ఆరోగ్యం, వ్యవసా యం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధిని ప్రాధాన్యత రంగాలుగా గుర్తించారు. ప్రణాళికా సంఘం రాష్ట్రాలకు 13 అంశాలకు సంబంధించి లక్ష్యాలను నిర్దేశించింది.

☞ ఈ క్రమంలో 10వ పంచవర్ష ప్రణాళిక సాధించిన ప్రగతిని వివరిస్తూ 11వ ప్రణాళిక ప్రారంభమైన తర్వాత ముఖ్యంగా 2008-09లో వృద్ధి రేటు మందగించిన నేపథ్యంలో ఈ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి గల అవకాశాలను వివరిస్తూ సమాధానం రాయాలి.

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి 1960-61లో స్థిర ధరల వద్ద రూ. 14,894 కోట్లు కాగా 2008-09లో రూ. 2,52,318 కోట్లకు పెరిగింది.
- రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి 2008-09 లో రూ 2,52,318 కోట్లకు పెరిగింది.
- ప్రణాళికా యుగంలో మొదటి 40ఏళ్లలో పారిశ్రామికీకరణ ప్రభుత్వ రంగంలోనే ఎక్కువగా చోటుచేసుకుంది. 2004-05 తర్వాత ప్రభుత్వం ప్రకటించిన అనేక ప్రోత్సాహకాలు, రాయితీలు వల్ల ప్రైవేట్ రంగంలో పారిశ్రామికీకరణ వేగవంతమయింది.
- 11వ ప్రణాళికలో వ్యవసాయ రంగంలో 5 శాతం, పారిశ్రామిక రంగంలో 10 శాతం, సేవారంగంలో 11 శాతం వృద్ధిని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.